# ఉత్తరాంధ్ర కథాస్థానీయత

## సాహిత్యవ్యాసాలు



డా॥ మల్లీశ్వరి

ఉత్తరాంధ్ర కథాస్థానీయత
సాహిత్య వ్యాసాలు
డా॥ మల్లీశ్వరి

ముఖచిత్రం : బొబ్బిలి వీణ

పుస్తకరూపకల్పన
నారాయణవేణు
విశాఖవర్మ

జూలై 2013
వెల : 40/-

పుస్తక ముద్రణ
ప్రింటెక్స్, వైజాగ్
0891-2740795

ప్రతులకు :
ప్రముఖ పుస్తక కేంద్రాలలో
For online purchases &
e-book : www.kinige.com

డా॥ మల్లీశ్వరి
39-5-11, II లేఅవుట్,
మురళీనగర్, విశాఖపట్నం-7.
malleswari.kn2008@gmail.com
సెల్ : 9246616788



# లోపలి పేజీల్లో...

★ కృతజ్ఞతలు ... ఉత్తరాంధ్ర
– మల్లీశ్వరి

★ ఒక అభిప్రాయం
– కోడూరి శ్రీరామమూర్తి

★ బతికి చెడిన దేశపు కథలు ........1

★ జన కథన మాంత్రికుడు – గంటేడ గౌరునాయుడు ........8

★ మాయాప్రపంచపు మానవీయ కథలు ......14

★ తెలుగు కథకి బాకీ పడిన సువర్ణముఖి ......20

★ ఇకటదారి చెప్పిన విలువైన కథలు ......27

★ వలిసె పూలవనంలో వికసించిన తొలి ఆశ ......33

★ విమర్శకులు కావాలి... విమర్శకులు ......39

★ ఉత్తరాంధ్ర కథ – రైతాంగ స్త్రీలు ......46

★ ఉత్తరాంధ్ర ప్రజాఉద్యమాల సాహిత్యం – పరిశీలన ......52

★ ఉత్తరాంధ్ర కథ – స్థానిక అస్తిత్వం ......59

1

# బతికి చెడిన దేశపు కథలు

తెలుగు వారి చరిత్రగా మనం వింటున్న చరిత్రలో ఉత్తరాంధ్ర పూర్తిగా అంతర్భాగం కాదు. ఉత్తర సర్కారులుగా పిలువబడుతూ ఒరిస్సాలోని గంజాం ప్రాంతంతో చాలాకాలం కలసివుంది. నిజాం రాజుల ఏలుబడి నుంచి బ్రిటిష్ వారి పాలనలోకి వచ్చిన తర్వాత స్వప్రయోజనాల కోసం వారు భౌతిక, బౌద్ధిక రంగాలపై శ్రద్ధ పెట్టి సంస్కరణలు అమలు జరిపారని, దానికి స్థానిక సమాజపు క్రియాశీలమైన సహకారం ఉందని బ్రిటీష్ ఆంధ్రలోని వికాస మూలాలను ఈ విధంగా చూడాల్సివుందని కొందరు విమర్శకులు అభిప్రాయపడ్డారు.

రాజమండ్రిలో మొదలైన సంఘసంస్కరణ ఉద్యమం తాలూకా సంస్కరణ భావాలు ఉత్తరాంధ్రలోని విజయనగరంలో వికసనం చెంది సాహిత్యంలో ఆధునికత ప్రవేశించిందని, దానికి ప్రధానమైన కారణం గురజాడలోని వ్యక్తిగత చైతన్యమని వల్లంపాటి విశ్లేషించారు.

విజయనగర సంస్థానాధీశులు విద్యారంగంలో చేసిన కృషి ఫలితంగా ఉత్తరాంధ్రలో సాంస్కృతిక చైతన్యానికి దారులు ఏర్పడడం కూడా ఒక వాస్తవమే.

తెలుగు సాహిత్యానికి గురజాడ, చాసో, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు,

భూషణం, పతంజలి లాంటి క్లాసికల్ కథకులను అందించిన ఉత్తరాంధ్ర కథ 1980ల తర్వాత కూడా ఆ ఒరవడిని కొనసాగించింది. బౌద్ధిక రంగంలో కొంత కృషి జరిగివుండి అటవీ సంపద, సముద్ర వనరులు, విశాలమైన మైదాన ప్రాంతం ఉన్నప్పటికీ ఉత్తరాంధ్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడక పోవడంలోని మూలాలను గత ముప్ఫయి ఏళ్ళుగా కథకులు అన్వేషిస్తూనే ఉన్నారు. ఆ అన్వేషణల ఫలితంగా ఉత్తరాంధ్ర వర్తమాన కథకు స్థానిక అస్తిత్వ స్పృహ సమకూరింది.

1980ల తర్వాత తెలుగు సమాజంలోని అన్ని రంగాల్లో చాలా వేగంగా వస్తున్న మార్పులను బతికి చెడిన దేశపు అనుభవాల ఆధారంగా తన కథల్లో రికార్డు చేస్తూ వస్తున్నారు అట్టాడ అప్పలనాయుడు.

స్థానిక వ్యక్తీకరణలోంచి కథావస్తువును సార్వజనీనం చేయడం మూలంగానే అప్పలనాయుడు కథలు కేవలం ఉత్తరాంధ్ర జీవితాలకే కాకుండా అభివృద్ధి విధ్వంసంలో విలవిల్లాడుతున్న అనేక ప్రాంతాలకు, ప్రజలకు చెందినవిగా కూడా ఉంటాయి.

స్థానిక అభివ్యక్తి అనేది భాషకి, శిల్పానికి సంబంధించినది మాత్రమే కాదు. ఆయా ప్రాంతాల సమస్త అంశాల విశిష్టతకి కూడా స్థానం ఉంటుంది. భౌగోళిక ప్రత్యేకతలు, ప్రజల జీవన విధానం, వనరులు, పంటలు, పరిశ్రమలు మొదలైనవి మిగతా ప్రాంతాలకి భిన్నంగా సొంత ముద్రని కలిగిఉంటాయి. ఇవన్నీ తప్పనిసరిగా సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. కాబట్టి ఒక రచనలో స్థానికత, సార్వత్రికత అనేవి ఒకదానితో మరొకటి ముడిపడివుంటాయి

ముప్ఫయి అయిదేళ్ళుగా విస్తృతమైన సంక్లిష్టమైన, కథాంశాలను ఎంచుకున్న అప్పలనాయుడి కథల స్థానీయ నేపథ్యం కూడా అంతే విస్తృతమూ సంక్లిష్టమూ.

1970ల నాటి శ్రీకాకుళం గిరిజనోద్యమ పోరాటం, తర్వాత పదేళ్లపాటు అది నిలిపి ఉంచిన ఉత్తేజం, ఎదురైన నిర్బంధం, మరింత దిగజారిన గిరిజనుల ఆర్థిక స్థితిగతులు, రూపం మార్చుకున్న దోపిడీ స్వభావం వీటన్నింటినీ అప్పలనాయుడు మొదటి కథా సంకలనం పోడు-పోరు విశ్లేషించింది.

గిరిజనోద్యమ పోరాటంలో ముంచి తీసినట్లుండే ఈ కథలు తొలి రచనా వ్యాసంగపు నిసర్గ శిల్పంతో వస్తువు పట్ల నిజాయితీతో వెలిగిపోతూ ఉంటాయి. ఏ మార్పయినా ఒక సంస్కృతిలో సంలీనం కావడానికి తక్షణావసరాలో, ఎడతెగకుండా సాగే పోరాటాలో కారణం అవుతాయి అనుకుంటే పోడు-పోరు నిండా ప్రతిఫలించిన రాజకీయ ఆర్థిక సామాజిక మార్పుల మూలాలను అన్వేషించే క్రమంలో ఉద్యమ చైతన్యాన్ని పోడు-పోరుకి ప్రాతిపదిక చేసుకున్నారు అప్పలనాయుడు.

నివసించే ఊరు, జీవనాధారమైన అడవి తప్ప మరో లోకం తెలీని గిరిజనుల జీవితాల్లోకి, వారి పోడు వ్యవసాయంలోకి, పట్నాలనుంచి, మైదాన ప్రాంతాలనుంచి వచ్చి పడిన బుగతలు, షావుకార్లు, వాళ్లు గిరిజనుల నెత్తిన రుద్దిన ఖండగుత్తలు, వీటిని ఎదిరించడానికి ఏర్పడిన గిరిజనసంఘాలు, ప్రజాకోర్టులు, 'కామ్రేలు' వారిపై తుపాకి ఎక్కుపెట్టిన పోలీసు క్యాంపులు, వీటన్నింటి మధ్య పోడుకోసం పోరు చేసిన బూగన్న, బిడ్డికోడు, ఉయ్యికి భీముడు, భిక్కుంలాంటి వేలాది వలసోళ్ళు ఈ సంపుటి నిండా పరుచుకున్నారు.

పార్వతీపురం ఏజన్సీలో తూర్పు కొండల్ని ఆనుకొని ఉన్న అడవుల్లో అక్కడ నివసించే గిరిజన తెగల్లోని క్రమ పరిణామాలను చిత్రించాలంటే వారి జీవితాలతో రచయితకి చాలా దగ్గర సంబంధం ఉండాలి.

అట్టాడ అప్పలనాయుడు పుట్టి పెరిగింది పార్వతీపురం ఏజన్సీకి దగ్గర గ్రామంలోనే. నాగావళి నదికి అవతల అడవి, ఇవతల గుమడ గ్రామం. కాఫీ కొట్టులో కూర్చుంటే ఇటు పోలీసులు, అటు దళ సభ్యులు ఏవో వార్తలు మోసుకొచ్చేవాళ్లు. అవి జీవితంలో భాగమైనపుడు వాటిని తప్పించుకోవడం అసాధ్యం. అందుకే పోడు-పోరులో ఉద్యమం దాని ప్రతిఫలనాలు అనివార్యంగా కథా వస్తువులయ్యాయి.

1990లకి పూర్వమే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, స్థానిక గిరిజనులకి ఏమాత్రం ఉపయోగపడక పోగా, వారి ఆర్థిక స్థితిగతులను దిగజార్చిన వైనం పోడు-పోరు మొదలుకొని క్షతగాత్రగానం వరకు చూడొచ్చు.

పోరాటాల నుంచి గిరిజనుల దృష్టి మరల్చడానికి వారి సంక్షేమం పేరిట ప్రభుత్వం ప్రకటించిన పునరావాస కార్యక్రమాలు సబ్సిడీలు, GDA లాంటి సంస్థలు వాస్తవంలో వారి స్థితిగతులను మరింత అంచుల్లోకి నెట్టేశాయి. ప్రభుత్వం ప్రకటించే ఈ ఆర్థిక ప్రణాళికల డొల్లతనాన్ని దగ్గరగా చూసే అవకాశం ఈ కథకుడికి తాను పనిచేసే బ్యాంకింగ్ రంగం ఇచ్చి ఉండొచ్చు. కాని అవి ప్రజలపై చూపే ప్రభావాలను చిత్రించడానికి విస్తృతమైన జీవితానుభవం, ప్రజల జీవితాలతో సన్నిహితమైన మానవీయ సంబంధాలు ఉంటేనే సాధ్యపడుతుంది.

'పోలేరమ్మ తల్లికీ పోలీసోడికి అడ్డేటి?" అన్న కాంతమ్మ (ప్రజాకోర్టు),

"నేలబుగ్గి నెత్తికి యెత్తుకున్నా బతుకెల్లకుంటంది" అన్న సూర్యనారాయణ (ప్రత్యామ్నాయం),

"ఆ ! అత్తోరింటిల పీటచెక్కమీద కూకోని, కూకోని - తినీ తినీ సూడు పిర్రలు ఎలగ బలిసినాయో" అని ఎండిన పుల్లల్లాంటి తన కటిభాగాన్ని తిప్పి చూపించి

ప్రపంచాన్నే వెక్కిరించిన ఇల్లాలు (బతికి చెడిన దేశం),

"బతుకులు కూలిపోయినయి. స్థూపం కూలడం సమస్యగా ఎవరికుంది నాయనా"... అన్న మాస్టారు, (యజ్ఞం... తర్వాత) వీళ్లందరి జీవితాలతో రచయితకి ఉన్న మమేకతకి రాజకీయ, ఆర్థిక అవగాహన తోడవడం మూలంగా ఈ కథలు ఒక కళారూపం ఇవ్వాల్సిన ప్రయోజనానికి సన్నిహితంగా ఉన్నాయి.

1990ల తర్వాత దేశవ్యాప్తంగా అమలులోకొచ్చిన సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా సమాజంలోని వెనకవరుస జీవితాలు, వాటి మూలాలు కదిలిపోవడం మొదలైంది. ఈ అల్లకల్లోలపు దశ నాటికి అప్పలనాయుడి కథా రంగం కొండ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతం వైపుకి మరలింది.

నూతన ఆర్థిక సంస్కరణల ప్రభావంతో విదేశీ పెట్టుబడులు దేశంలోకి వచ్చి పడతాయనుకుంటే అలా జరగకపోగా స్థానిక వనరుల దోపిడి, తరలింపు జరిగాయి. ఆ ధాటికి అర్థదశాబ్దిలోనే గ్రామీణ జీవన మూలాలు పెకలింపబడ్డాయి. ఆ తీవ్రతని ప్రత్యామ్నాయం కథల సంపుటి (1998) విశ్లేషించింది.

చిన్న చిన్న చేపల్ని పెద్ద తిమింగలం తినేసినట్లు షాపింగ్ మాల్స్ హవాలో చిన్న వ్యాపారాలు కొట్టుకుపోవడాన్ని భద్రయ్య కథలో చూస్తాం. 'వేళ్లు తెగిన' కథ కూడా ప్రపంచీకరణని మానవ సంబంధాల నేపథ్యంలో చూసినదే.

ఈ దశలోనే కోస్తా ప్రాంతపు పెద్ద రైతులు పెట్టుబడిదారుల అవతారమెత్తి చౌకగా పొలాలు కొని ఈ ప్రాంతపు ఉత్పత్తి సాధనాలపై తమ ఆధిపత్యాన్ని ప్రకటించడం మొదలుపెట్టారు. కోస్తా వ్యవసాయ సంస్కృతిలోని వ్యాపార పంటలు ఉత్తరాంధ్రకీ వ్యాపించాయి. బంధాలు-అనుబంధాలు కథ ఈ పరిణామాన్ని మనిషికీ భూమికీ మధ్య ఉండే అనుబంధం నేపథ్యంలో చిత్రించింది.

ఈ సంపుటిలోనే కాక అప్పలనాయుడి కథలన్నింటి నేపథ్యంలోనూ యింకొక విశిష్ట లక్షణం ఉంది. క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు స్థానిక రాజకీయాల పట్ల ఆయనకున్న అవగాహన తక్కువ మంది రచయితలలో మాత్రమే చూడగలం. అందుకే గొప్ప కథలు రాసిన మానవతావాద రచయితగా కన్నా గత ముప్ఫయి అయిదేళ్లుగా ఉత్తరాంధ్ర రాజకీయ పరిణామాలను ఒక క్రమ పద్ధతిలో డాక్యుమెంట్ చేసిన బాధ్యత గల అరుదైన రాజకీయ రచయితగా అప్పలనాయుడు స్ఫురణకు వస్తారు.

స్థానిక పోరాటాల్లోని వివిధ చారిత్రక ఘటనలమధ్య సమన్వయంగాను, కొనసాగింపుగాను రాసిన కథలు వాళ్లు, యజ్ఞం...తర్వాత, ఒక పొట్టివాడు-ముగ్గురు పొడవువాళ్ల కథ (2005). విప్లవోద్యమ ఉధృతి చల్లారి, పునర్నిర్మాణమవుతున్న దశలోని

అణచివేతను, ఒడుదుడుకులను, అపసవ్యతలను ఎటువంటి తీర్పులు లేకుండా వాస్తవిక దృక్పథంతో చెప్పారు అప్పలనాయుడు.

సరళీకృత ఆర్థిక విధానాలు రెండవ దశలోకి ప్రవేశించిన కాలపు ఉత్తరాంధ్ర జీవితాలను క్షతగాత్రగానం (2009) సంపుటిలో చూస్తాము. ఈ దశ అప్పలనాయుడిని కథకుడిగానే కాక అస్తిత్వ స్పృహ ఉన్న ఒక సామాజిక కార్యకర్తగా కూడా మనముందు నిలబెడుతుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారినట్లుగానే ఒక కుగ్రామానికి ప్రపంచానికున్నంత సంక్లిష్టత ఏర్పడింది. విప్లవోద్యమ ప్రభావం తగ్గుముఖం పట్టిన స్థితి, సబ్సిడీలు, సూక్ష్మరుణాల్లాంటి సంక్షేమ పథకాల్లోని అసలు ఉద్దేశాలు, లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్.పి.జి) బలహీనులపై చేస్తున్న ముప్పేట దాడి, ఇక్కడి భూములపై కోస్తాంధ్ర వలసవాదుల ఆధిపత్యం, కొత్తశత్రువు అలికిడి నేపథ్యంలో అభివృద్ధి విధ్వంసపు అల్లిక చిక్కుముడులను విప్పడానికి క్షతగాత్రగానం ప్రయత్నించింది. ఈ ప్రయత్నం చాలా శ్రమతో బరువుతో కూడిన పని. కథకుడు మోస్తున్న ఈ ఇతివృత్త నేపథ్యపు బరువుని కొన్ని కథల్లో పాఠకులు కూడా మోయాల్సివచ్చింది. అది రచయిత పరిమితిగా కాక ఉత్తరాంధ్ర సమాజ వాస్తవికతలో కొత్తగా ఏర్పడుతున్న గందరగోళంగానే చూడాలి.

ఈ సంపుటిలోని 'షా' కథ స్థానిక వనరుల దోపిడీ కోసం బయటి శత్రువు వేసుకున్న కొత్త ముసుగుని పసిగట్టి ముందే హెచ్చరించిన కథ. స్థానిక ఉత్పత్తి సాధనాలన్నీ కార్పోరేటీకరణ చెందడం ద్వారా ఉత్తరాంధ్రలో జరుగుతున్న పెనుమార్పులను, వాటిని ఎదుర్కోడానికి అవసరమైన ప్రత్యామ్నాయ సాధనాలను రచయిత సూచించారు.

స్థానికతను సమూలంగా తుడిచిపెట్టే ఇలాంటి పరిణామాలను ఎదుర్కోడానికి స్థానిక సమాజంలోని అన్ని వర్గాలు ఏకతాటి మీదికి రాకతప్పదని అప్పలనాయుడు ఈ కథలో విశ్లేషించారు. 'షా'లో పెద్ద రైతుల పట్ల కథకుడు చూపిన సానుభూతిని ఈ కోణంలోనే చూడాల్సివుంది. ఆ అవగాహన సరైనదేనని నిరూపిస్తూ రచయిత క్రాంతదర్శనత్వానికి రుజువుగా సోంపేట ఉద్యమం మనముందు నిలిచింది.

ప్రజల జీవనాధార వృత్తులను, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని సహజ సంపదలను పణంగా పెట్టి సొంత ప్రయోజనాల కోసం పవర్ ప్రాజెక్టుని నిర్మించ తలపెట్టిన కార్పొరేట్ సంస్థ నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీని ఎదిరించడానికి స్థానికంగా ఉన్న ప్రజలందరు కుల మత వర్గ లింగ భేదం లేకుండా ఒక్కటయ్యారు. ఉమ్మడి, బైటి శత్రువుని

ఎదిరించారు.

ఈ ఎరుక, ఈ స్పృహ అప్పలనాయుడి కథాప్రయాణంలో ఒక మలుపుగా మారుతున్న ప్రాధాన్యాలకి చిహ్నంగా గుర్తించవలసి వుందేమో పరిశీలించాలి.

సోంపేట, కాకరాపల్లి మొదలైనచోట్ల జరుగుతున్న పోరాటాల నేపథ్యంలో అప్పలనాయుడు రాసిన సందిగ్ధాకాశం (2010), వికృతి (2011) కథలు ఆయనలో స్థిరపడుతున్న అస్తిత్వ చైతన్యాన్ని పట్టిస్తాయి. తమ సమాజంలోని అన్ని రంగాల్లో ఏ విధమైన పరాయీకరణని అంగీకరించకుండా రాజకీయ, ఆర్థిక ఆకాంక్షతో జరిగే పోరాటాలను ప్రాంతీయ ఉద్యమాలు అని స్థూలంగా అనుకోవచ్చు. ఉత్తరాంధ్రలో ఇంతకుముందు జరిగిన పోరాటాలు ఈ ప్రాతిపదికన జరిగినవి కావు.

కానీ ఇప్పుడు సమస్త స్థానిక వనరుల మీద, అవకాశాలమీద, స్థానికులకే అధికారం అన్న ఆకాంక్ష దిశగా అప్పలనాయుడు కథా సాహిత్యం చాలా దూరం ప్రయాణించింది.

1978 నుంచి కథలు రాస్తున్న అప్పలనాయుడు తొలి దశలో 'అభివ్యక్తిలో స్థానిక అస్తిత్వ స్పృహ కలిగి వుండి వర్గచైతన్యంతో రచనలు చేసారు. తన మూడున్నర దశాబ్దాల సాహిత్య సామాజిక అనుభవాల ఫలితంగా వర్గ స్పృహ కలిగిన స్థానిక అస్తిత్వ వాద రచయితగా పరిణామం చెందారు.

"ఇది విశాలాంధ్రలో ఉత్తరాంధ్ర స్థితి! ఈ స్థితి పోవడానికి నినాదం కావాలి. ఓ ఉద్యమం కావాలి. బొత్స సత్తిబాబు – ఈ వెలుగులో యీ నేల ఆర్తిని తీర్చే ఆచరణకు నడుంకడితే ఎంతో బాగుణ్ణు! ఈ దిశగా అడుగువేస్తే ఉత్తరాంధ్రా అందుకోసరం ఎదురుచూస్తోంది. సత్తిబాబయినా, మరెవరయినా సై...!" అని కుండబద్దలు కొట్టిన అట్టాడ అప్పలనాయుడు, రాజకీయ ఆకాంక్షలు నేపథ్యంగా కలిగిన ఉత్తరాంధ్ర అస్తిత్వ సాహిత్య ఉద్యమకారుడిగా స్థిరపడుతున్నారన్నదే నా ప్రతిపాదన.

✦ **ఆగష్టు-2012** ✦

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1979**

* * *

Read other books of Dr. Malleeswari @

**http://kinige.com/kbrowse.php?via=author&name=Dr.+Malleeswari&id=150**